
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

సోమవారం 10 నవంబరు 2025





కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

అమరేశ్వరాలయంలో కార్తీక సందడి

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయం సందడిగా మారింది. ప్రథమ ఆరామమైన అమరేశ్వరాలయ సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమరావతికి చేరుకున్న భక్తులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, నదీతీరంలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



క్యూలో బారులు దీరిన భక్తులు



శంకర్ నేత్రాలయంలో అధునాతన మిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

శంకర్ ఆస్పత్రి.. సేవలు అసమాన్యం

- ❖ సామాన్యులకు అందుబాటులోకి నేత్రవైద్యం
- ❖ పెదకాకానిలో నేత్రాలయం ఏర్పాటు మన అదృష్టం
- ❖ నూతన బ్లాక్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అసమాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆదివారం గుంటూరుకు సమీపం పెదకాకానిలోని శంకర్ నేత్రాలయంలో ఐ కేర్ సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెదకాకానిలో శంకర్ నేత్రాలయ ఏర్పాటు అదృష్టంగా భావించాలన్నారు. ఐదు రాష్ట్రాల్లో 14 ఆస్పత్రుల ద్వారా ఇప్పటి వరకు 70 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు జరిగాయని కొనియాడారు. సామాన్యులకు సైతం నేత్ర వైద్యం అందుబాటులో తీసుకొచ్చిన ఘనత కంచి కామకోటి పీఠానిదన్నారు. ప్రతిఒక్కరికీ కంటి వెలుగు అందేలా శంకర కంటి ఆస్పత్రి కీలకపాత్ర పోషించాలన్నారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని భావించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మానవసేవే.. మాధవసేవ

పేదరికం లేని సమాజం చూడాలన్నది జగద్గురు ఆది శంకరాచార్యుల కల. ఇది అసాధ్యం కాదు. అందరం అనుకుంటే సాధ్యం. దేశంలోని అన్ని పీఠాలకు కంచి కామ కోటి పీఠం ఆదర్శవంతం. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా కంచి పీఠాన్ని ఆదిశంకరాచార్యులు తీర్చిదిద్దారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి కంచి పీఠం వైద్య సేవలందిస్తుండటం స్ఫూర్తిదాయకం. కంచి పీఠం చేసే అన్ని కార్యక్రమాలకు అండగా ఉంటాం.

-ముఖ్యమంత్రి చంద్రబాబు

విద్య, వైద్యమే లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్య, రోగులకు మంచి వైద్యం, మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం అందించడమే తమ లక్ష్యమని కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. కంచి పీఠం తరఫున చదువు, బలం, మంచిపేరు, కీర్తి, పుణ్యం తదితర ఐదు రకాల సేవలు నిత్యం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అనేకమైన ప్రార్థనలు, ప్రయత్నాలు ధర్మబద్ధంగా జరుగుతున్నాయన్నారు. విద్య, సంస్కృతి కలిపి శంకర స్కూల్స్ ప్రారంభం కానున్నాయని తెలిపారు. మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఆర్.వి .రమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సలహా మేరకు త్వరలో ఏఐ టెక్నాలజీ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, జీడీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, డాక్టర్ జేకే రెడ్డి, మురళీకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పెద్దపులి దాడి.. రెండు గేదెల మృతి

వజ్రాలపాడుతండా వాసుల్లో భయాందోళనలు

వెల్దుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని వజ్రాలపాడు తండా సమీపంలో రెండు రోజులుగా పెద్దపులి దాడిలో రెండు గేదెలు మృతి చెందాయి. అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన సమయంలో పశువులపై పెద్దపులి దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. మూఢావత్ తులస్యానాయక్‌కు చెందిన ఓ గేదె శనివారం సాయంత్రం మృతి చెందగా, ఆదివారం మధ్యాహ్నం మరో గేదె మృత్యువాత పడింది. దీంతో గ్రామ స్థులు భయాందోళన చెందుతున్నారు. సంఘటనా స్థలాన్ని అటవీశాఖాధికారులు ఆదివారం పరిశీలించారు. అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అడవి లోపలికి వెళ్లకుండా చూడాలన్నారు. పొలం పనులకు గుంపులుగా వెళ్లాలన్నారు. రాత్రి వేళ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు రేంజర్ సుజాత తెలిపారు. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, పాదముద్రలను పరిశీలించి ఒకే పులి రెండుసార్లు దాడి చేసిందా లేదా వేర్వేరుగా దాడి ఏమైనా జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నామన్నారు.



మృతిచెందిన గేదె

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతికి సంబంధించి మార్చి 2026 పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఎల్ చంద్రకళ, ఎగ్జామినేషన్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్ తెలిపారు. ఎఫ్ఏ -1, 2 మార్కులు ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్ల వారీగా విద్యార్థులను విభజించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. డీసీఈబీ మెటీరియల్‌ను నవంబరు 30 లోపు సిలబస్ పూర్తి చేసి వంద రోజుల ప్రణాళిక ద్వారా ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులందరూ ప్రత్యేక తరగతులు తప్పకుండా నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని, ఆత్మవిశ్వాసంతో రాయాలన్నారు. జిల్లాలో 150 కేంద్రాలు ఏర్పాటు చేయగా 60 శాతం కేంద్రాలను పరిశీలించామన్నారు. పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉంటేనే పరీక్ష కేంద్రానికి అనుమతులు ఇస్తామన్నారు. పరీక్ష రాసే గదుల్లో బెంచీలు తప్పనిసరని, ఫ్యాన్, విద్యుత్ సదుపాయం ఉండేలా చేస్తున్నామన్నారు. జంబ్లింగ్ విధానంలో విద్యార్థులకు కేంద్రాల కేటాయింపు జరుగుతుంటుందన్నారు.



ముగిసిన బాలోత్సవ్

- ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు

వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటి (వీవీఐటీ)లో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనగా.. దాదాపు 25 వేల మంది ప్రేక్షకులు బాలల ప్రదర్శనలు తిలకించి మైమరచిపోయారు. బాలలు వారి ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.

-పెదకాకాని, ఆంధ్రజ్యోతి



వ్యాన్‌ను ఢీకొన్న లారీ

దిడుగుకు చెందిన ఇద్దరు మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావు పేట బైపాస్ రోడ్డులో వినుకొండ వైపు వై జంక్షన్ వద్ద శనివారం రాత్రి డైలీ పార్సిల్ వ్యాన్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన చలంచర్ల నాగబాబు (17), చేవూరి మల్లేశ్వరరావు(30) మృతి చెందారు. నాగబాబు, మల్లేశ్వరరావులు ద్విచక్ర వాహనంపై అద్దంకిలోని బంధువులు వద్దకు వెళ్తున్నారు. నరసరావుపేట పట్టణంలోని బైపాస్ మీదకు వెళ్తుండగా అదే సమయంలో వినుకొండ నుంచి గుంటూరు వెళ్తున్న పార్సిల్ వ్యాన్ వీరిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వీరిద్దరూ మృతి చెందారు. రూరల్ ఎస్ఐ ఫాతిమా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు నాగబాబు తండ్రి కుటుంబరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మృతి చెందిన చలంచర్ల నాగబాబు, చేవూరి మల్లేశ్వరరావు



వెంగళాయపాలేనికి.. సరోవరం

- పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి
- పీఎంకేఎస్‌వై 2.0లో రూ.1.20 కోట్లతో పనులు
- ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు ఆదాయంపై ప్రయోగం
- ఇక్కడ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- చెరువు పరిశీలనకు రేపు కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక



చెరువు కట్ట ఆవరణలో కొబ్బరి, అరటి చెట్లను నాటుతున్న సిబ్బంది



గుంటూరు శివారులోని వెంగళాయపాలెం చెరువుకు మహర్దశ పట్టింది. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో చెరువుకు కేంద్ర ప్రభుత్వం వరమిచ్చింది. పిచ్చిచెట్లు.. గోతులు.. అపరిశుభ్ర పరిసరాలతో అధ్వానంగా ఉండే చెరువు సర్వాంగ సుందరంగా మా రింది. గతంలో గ్రామంలోని వారికే పట్టని చెరువు ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. పెద్దలకు ఆరోగ్యం, పిల్లలకు ఆహ్లాదకరం అందించడంతో పాటు స్వయం సమృద్ధి చెంది ఆదాయం ఆర్జించేలా అభివృద్ధి చేశారు. వాటర్ షెడ్ పథకంలో మోడల్ ప్రాజెక్టుగా వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ చేపట్టారు. చెరువు కట్ట పటిష్టంతో పాటు కొబ్బరి మొక్కలు, వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, జిమ్, పార్కు వంటి సౌకర్యాలతో నందనవనాన్ని తలపిస్తోంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 130 మంది ప్రతినిధులు రానున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని వాటర్‌షెడ్‌కు సంబంధించిన జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేయడంతో పాటు వెంగళాయ పాలెంలో వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చెరువు పునరుద్ధరణ చేశారు. దీంతో ప్రస్తుతం చెరువు పర్యాటక ప్రాంతంగా మారింది. 23.5 ఎకరాల్లో విస్తరించిన వెంగళాయ పాలెం చెరువును గతంలో గ్రామస్థులు తాగునీటి అవసరాలకు వినియోగించుకునేవారు. క్రమేణా గ్రామంలో తాగునీటికి ప్రత్యామ్నాయంతో పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీటి అవసరాలకే చెరువు (మిగతా 7లో)



నల్లపాడు లయోలా పాఠశాలలో జరుగుతున్న వాటర్ షెడ్ మహోత్సవ సభ ఏర్పాట్లు



చెరువు ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు



వెంగళాయపాలెం చెరువు

దిక్సూచి

జాతీయ స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో(ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ) ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ మెయిన్ షెడ్యూల్ ఆరంభమైంది. మొదటి సెషన్ జనవరి 21 నుంచి జరుగనుంది. తదుపరి రెండు నెలలూ ఇంటర్ పరీక్షలతో బిజీబిజీ. అపై ఏప్రిల్ నెలలో రెండోసెషన్ ఉంటుంది. అంటే పది నుంచి పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ప్రిపరేషన్‌కు అప్పుడు సమయంటుంటుంది. అలాగే జనవరి సెషన్‌లో ఏదైనా పొరపాటు జరిగితే రెండోదైన ఏప్రిల్ సెషన్‌లో మెరుగుపర్చుకోవచ్చు. ఆ నేపథ్యంలో జనవరి సెషన్‌లోనే మంచి స్కోర్‌కు గట్టి ప్రయత్నం చేయడం మంచిది. అలా చేస్తే ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేందుకు సరిపోను సమయం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన ముఖ్యమైన కొన్నింటిని చూద్దాం. ప్రధానంగా ఈ సారి ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ఫాంట్‌ను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

జేఈఈ మెయిన్
జనవరి సెషన్ బెస్ట్



- ఇంటర్ రెండేళ్ళ సిలబస్ - మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విషయంలో ఈ నెల నుంచే గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌పై దృష్టిపెట్టాలి. డెబ్బయ్ నుంచి ఎనభై శాతం ప్రశ్నలు ఫౌండేషన్స్‌పైనే ఆధారపడి ఉంటాయని గమనించాలి.
- ఫాస్ట్ రివిజన్ షీట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిలో అన్ని ముఖ్యమైన ఫార్ములా, రియాక్షన్, ఈక్వేషన్‌ని ఒకే చోట సబ్జెక్టువారీగా రాసుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంతో ప్రతి రెండు సబ్జెక్టుల మధ్య ట్రాన్సిషనల్ గ్యాప్‌ని తప్పనిసరిగా ఉంచుకోవాలి. పరీక్ష సమయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలి. జిగ్ జాగ్ లేదంటే ర్యాండమ్ అటెంప్టులు అస్సలు చేయకూడదు.
- కాలేజీ ముగిసిన తరవాత రోజూ కనీసం నాలుగు గంటల సమయాన్ని స్టడీకి కేటాయించాలి. థియరీతోపాటు కచ్చితంగా న్యూమరికల్స్‌ను సాల్వ్‌చేయాలి. కాలిక్యులేటర్‌ను ఉపయోగించవద్దు. అటెంప్ట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మీ నోట్స్ లేదంటే పాఠ్యపుస్తకాన్ని రిఫర్ చేయండి.
- టైమ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. గడిచిన కొన్నేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేయడం ద్వారా ఒక నిర్ణీత అంచనాకు రావచ్చు. ఏ సబ్జెక్టులో ఏయే కాన్సెప్టుల్లో సులువైన ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు. తద్వారా వాటిపై శ్రద్ధపెట్టవచ్చు. ఉదాహరణకు ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి సులువైన ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అక్కడ మిగిలిన సమయాన్ని కష్టమైన ప్రశ్నలను సాల్వ్ చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.
- ప్రతి వారం కనీసం రెండు మాక్‌టెస్టులను ప్రాక్టీస్ చేయాలి. టెస్ట్ పూర్తయ్యాక ఎర్రర్ అనాలిసిస్ చేసుకోవాలి. ఏ టాపిక్‌లో ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయో గమనించి, ఆ కాన్సెప్ట్‌ని మరో సారి రివైజ్ చేసుకోవాలి.
- అన్ని చాప్టర్లు అని కాకుండా ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి. మేథ్స్‌లో కాలిక్యులస్, జామెట్రీ; ఫిజిక్స్‌లో మెకానిక్స్ ఎలక్ట్రిసిటీ; కెమిస్ట్రీలో ఆర్గానిక్‌కు ఎక్కువ వెయిటేజ్ ఉంటుంది.
- మాక్ టెస్టుల్లో స్కోర్ యావరేజ్ అంటే 150కి మించేలా చూసుకోవాలి. ఒకవేళ తగ్గినట్లయితే ఒక చాప్టర్‌పై అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పులు ఎలా, ఎందుకు జరుగుతున్నాయో గమనించాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- గెస్ వర్క్ అస్సలు చేయవద్దు. పరీక్షలో కూడా ఎలిమినేషన్ పద్ధతి ఫాలో అవ్వండి. ఎంసీక్యూలో రెండు లేదా మూడు ఆప్షన్స్ తప్పు అని నిక్కచ్చిగా తెలిస్తే జవాబును గుర్తించడం సులువు అవుతుంది.
- అసలు ఎగ్జామ్‌లో కూడా సులువు నుంచి మోడరేట్‌గా ఉండే ప్రశ్నలు, అలాగే మీకు నచ్చిన సబ్జెక్టుతో అటెంప్ట్ మొదలుపెట్టండి. ఇందుకోసం ముందు మొత్తం పేపర్‌ని విశ్లేషించుకోవాలి. అందుకు కనీసం పది నిమిషాలు కేటాయించుకోవాలి. ఒక్క విషయం, కొన్ని సంవత్సరాల ప్రశ్నపత్రాల సరళిని గమనిస్తే, మేథ్స్‌లో అడిగే ప్రశ్నల నిడివి ఎక్కువగా, కఠినంగానూ ఉంటున్నాయి. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో సులువుగా, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ ఆధారంగా ప్రశ్నలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా మంచిది.
- అన్నింటికీ మించి సరైన ఆహార అలవాట్లు, తగిన నిద్ర తప్పనిసరి. డిజిటల్ అడిక్షన్‌కు దూరంగా ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ప్రశాంతత పెరిగి మంచి స్కోర్ సాధించే వీలు ఉంటుంది.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్సలెన్సియా, హైదరాబాద్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో
లోకల్ బ్యాంక్ ఆఫీసర్స్

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్(ఎల్‌బీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో తెలంగాణలో 88, ఏపీలో 5 పోస్టులు ఉన్నాయి.
అర్హత: అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం ఏడాదిపాటు క్లరికల్/ అధికారి కేడర్‌లో బ్యాంకింగ్ రంగంలో పనిచేసి ఉండాలి.
వయస్సు: 20-30 సంవత్సరాల మధ్య.
ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లోకల్ లాంగ్వేజ్ పరీక్ష ఆధారంగా
అన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 23
వెబ్‌సైట్: https://pnb.bank.in/

ఎన్‌సీపీఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 114 డిప్యూటీ మేనేజర్(హెచ్ఆర్ 31. ఎఫ్ అండ్ ఎ 48, సీఅండ్ ఎంఎం 34, లీగల్ 1), 8 హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులు ఉన్నాయి. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం www.npcilcareers.co.in /www.npcil.nic.in. చూడవచ్చు.

జాబ్ కార్నర్

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) 110 అసిస్టెంట్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. జనరల్ 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్ 2, సివిల్ 3) పోస్టులు ఉన్నాయి.
అర్హత: పోస్టును బట్టి ఏదైనా పీజీ/ ఇంజనీరింగ్ డిగ్రీ/ లాలో డిగ్రీ ప్లస్ రెండేళ్ళ అనుభవం.
ఎంపిక: రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
అన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 28
వెబ్‌సైట్: www.sebi.gov.in



బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజనీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) 340 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఇంజనీర్స్(ఎలక్ట్రాన్స్ 175, మెకానికల్ 109, కంప్యూటర్ సైన్స్ 42, ఎలక్ట్రికల్ 14 పోస్టులు ఉన్నాయి)
అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 25 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వుడ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
అన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 14
వెబ్‌సైట్: https://bel-india.in/

ఐబీలో 258 మంది ఆఫీసర్స్

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 అధికారుల(అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.
పోస్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(90), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(168) పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సైన్సెస్‌లో పీజీ(ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్‌తో ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024, 2025 గేట్ ఎగ్జామ్(కోడ్ ఈసీ/ సీఎస్)లో నిర్దేశిత అర్హతతో కటాఫ్ మార్కులు సాధించి ఉండాలి.
ఎంపిక: నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
అన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 16
వెబ్‌సైట్: www.mha.gov.in/www.ncs.gov.in

ఎన్‌హెచ్ఏఐలో...

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధపోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
పోస్టులు: డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) 9, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ 1, జూనియర్ ట్రాన్స్‌లేషన్ అధికారి 1, అకౌంటెంట్ 42 స్టెనోగ్రాఫర్ 32.
పోస్టునుబట్టి ఎంపిక ప్రక్రియ ఉంది. అర్హతలు విడివిడిగా ప్రకటనలో ఇచ్చారు.
అఖరు తేదీ: డిసెంబర్ 15
వెబ్‌సైట్: nhai.gov.in/

నీట్ ఎస్ఎస్ రిజిస్ట్రేషన్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ - నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ - సూపర్ స్పెషాలిటీ(నీట్ ఎస్ఎస్) 2025కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. నవంబర్ 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనిలో సాధించిన మెరిట్ ఆధారంగానే వైద్యవిద్య సంస్థలు అందించే డీఎం, ఎంసీహెచ్, డీఆర్ఎన్‌బీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ టెస్ట్ జరుగుతుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** exam.natboard.edu.in/



టీఐఎఫ్ఆర్‌హెచ్‌లో అడ్మిషన్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ - హైదరాబాద్(టీఐఎఫ్ఆర్‌హెచ్) కెమిస్ట్రీ, ఫిజిక్స్ అడ్మిషన్ బోర్డులు కలపి పీహెచ్‌డీ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - పీహెచ్‌డి ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో నాలుగు ఖాళీలు ఉన్నాయి. కోర్సు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, అసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://gasadmissions.tifrh.res.in
అకడమిక్ కోఆర్డినేటర్ ఈమెయిల్: gasadmissions@tifrh.res.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పెళ్లి షురూ



ప్రియదర్శి ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

క్రైమ్ థ్రిల్లర్



వజ్ర యోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. విలన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మహిళల వరుస హత్యల కేసు నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని తెలిపారు.



పెద్దితో ఆ కోరిక తీరింది

రామ్‌చరణ్

'సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో పనిచేయాలనేది నా కల. అది 'పెద్ది' చిత్రంతో నెరవేరింది' అని అన్నారు రామ్‌చరణ్. ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. రామ్‌చరణ్, జాన్వీకపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' నుంచి 'చికిరి' పాట లిరికల్ వీడియోను తెరపై ఆవిష్కరించారు. రెహ్మాన్ తనయుడు ఏఆర్ అమీన్ ఈ పాటను వేదికపై ఆలపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ 'నా సంగీత ప్రయాణం తెలుగులోనే ఆరంభమైంది. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమాలతో తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, ఆదరణ ఎంతో సంతోషాన్నిస్తోంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణం' అని చెప్పారు.

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయమౌతున్నాడు. కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'పలాస' చిత్రాల దర్శకుడు అజయ్‌భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు అజయ్ భూపతి. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు పిక్చర్స్ లిమిటెడ్ బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'ఏబీ4'.

వేధింపుల కేసులో ఊహించని మలుపు



సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో) మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నిరాధార ఆరోపణలతో తనను వేధిస్తున్నారని కథానాయిక అనుపమా పరమేశ్వరన్ కొన్ని రోజుల క్రితం కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. ఎవరో ఆకతాయిలు, పోకిరీ వ్యక్తులు అనుపమను వేధిస్తున్నారని భావించారు. అయితే ఆమెపై వేధింపులకు పాల్పడింది అబ్బాయిలు కాదు, ఓ 20 ఏళ్ల యువతి అని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమిళనాడుకు చెందిన నిందితురాలు పలు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకొని, అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు తేలింది. నిందితురాలు పిన్న వయస్కురాలు కావడంతో ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి వివరాలను బహిర్గతం చేయదలుచుకోలేదు అని అనుపమ తెలిపారు. అయితే ఈ కేసులో చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. సైబర్ వేధింపులు శిక్షార్హమైన నేరం, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అనుపమ కోరారు.

చిరంజీవిని క్షమాపణలు కోరిన రామ్ గోపాల్



తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఆయన్ను క్షమాపణలు కోరారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఈనెల 14న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో సందేశంలో చిత్ర బృందాన్ని అభినందించారు. "శివ' సినిమా చూసి నేను ఆశ్చర్యపోయా. అది సినిమా కాదు ఓ విప్లవం, తెలుగు సినిమాకి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం మంచి విషయం. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని చిరంజీవి అన్నారు. ఈ వీడియోను ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'థాంక్స్ చిరంజీవి గారు.. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నా. విశాల హృదయంతో మా చిత్ర బృందాన్ని అభినందించినందుకు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. గతంలో పలు సందర్భాల్లో మెగా బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు రామ్ గోపాల్ వర్మ.

ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా...



'మసూద' ఫేమ్ తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఓ చిత్రం ఆదివారం ప్రారంభమైంది. భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఓ హిలేరియస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ అన్నారు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈనెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. అతి త్వరలోనే పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీవరప్రసాద్, సినిమాటోగ్రఫీ: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచి రాజు.

వినోదం... విజ్ఞానం



వనాలను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, నాగదుర్గ ప్రధాన తారాగణం. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మించారు. ఇటీవలె చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈనెల 21న 'కలివి వనం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.వినోదంతో పాటు విజ్ఞానాన్ని ఇచ్చే చిత్రమిదని దర్శకుడు తెలిపారు.



మేఘాలయలో చిత్రీకరణ

- వేణు దోనేపూడి

'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాజా రవీంద్ర, విస్మయ్, టిన్ను ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా గుణ మాచికంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. మేఘాలయలో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో టీమ్‌ను కలసిన మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఓ సినిమా పూర్తి షూటింగ్ మేఘాలయాలోనే జరగడం ఇదే ప్రథమం. ఒక్క రోజులో ఆరుగురు వ్యక్తుల మధ్య జరిగే ఆసక్తికరమైన క్రైమ్ కామెడీ ఇది. ఎప్పుడూ వర్షం పడుతూ ఉండే ఈ ప్రాంతంలో షూటింగ్ అంత సులువు కాదు. అయినా అన్ని సవాళ్లు స్వీకరించి ముందుకు సాగుతున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో ఉపేంద్ర లిమియే, జార్జ్ మరియన్, రాజా అక్షయ్ లఘుసాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాలుగు యుగాల నేపథ్యంలో



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'నాలుగు యుగాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేమ, పునర్జన్మ, పురాణ గాథలను స్పృశిస్తూ సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగు హక్కులను నిర్మాతలు కే. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి దక్కించుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విలియం జే, సంగీతం: జుడా శాండి.

గొప్ప అనుభూతినిచ్చేలా..



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు హరీశ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇందులోని అన్ని క్యారెక్టర్లతో మీరు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ "జిగ్రీస్' ఒక కల్ట్ సినిమాగా ఉండబోతుంది. వినోదంతోపాటు భావోద్వేగాలూ ఉంటాయి' అని తెలిపారు.

కొత్త చిత్రం ప్రారంభం



త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా దర్శకుడు కే.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో 'ఇరువురు భామల కౌగిలి'లో అనే కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ బేనర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా దర్శకుడు బిగోపాల్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు.

వెంగళాయపాలేనికి.. సరోవరం

(5వ పేజీ తరువాయి)

పరిమితమైంది. దీంతో పశువుల సంచారంతో చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రూపం కోల్పోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువు చుట్టూ ఖాళీ స్థలంతో పాటు.. విశాలంగా ఉండటంతో జాతీయస్థాయిలో ఎంపిక చేసి, అమృత సరోవర్ అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు, చెరువులో చేపల పెంపకానికి కూడా చర్యలు చేపట్టారు. తద్వారా ఆదాయం కూడా ఆర్జించేలా చెరువును అభివృద్ధి చేశారు. కొబ్బరి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షలు, చేపల పెంపకం ద్వారా రూ.2 లక్షలు పంచాయతీకి సమకూరుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలుకు పాలకులు, అధికారులు ఆలోచన చేస్తున్నారు.

రేపు పరిశీలన.. సభ

రెండు రోజుల వాటర్‌షెడ్ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమవుతుంది. కాగా చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు కూడా రానున్నారు. ఆ తర్వాత వెంగళాయపాలెంలోని నల్లపాడు, లయోలా పాఠశాలలో వాటర్ షెడ్ మహోత్సవం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. చెరువుతో పాటు వెంగళాయపాలెం గ్రామంలో డివైడర్‌కు రంగులతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. లయోలా పాఠశాలలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వాటర్‌షెడ్ మహోత్సవ్‌కి విస్తృత ఏర్పాట్లు

● గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, పక్కన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమవారం నుంచి రెండు రోజులు జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ ఆదేశించారు. గుంటూరు ఐటీసీ హోటల్‌లో సోమవారం ప్రారంభమయ్యే సదస్సు వేదికను ఆయన ఆదివారం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ కింద వెంగళాయపాలెంలో నిర్మిస్తున్న ఊట చెరువు పనులను, లయోలా పాఠశాల ఆవరణలో జరిగే సభ ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించారు. ఆయా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నిఖిల్‌కడే, వాటర్‌షెడ్ విభాగం సంచాలకుడు వైవీకే షణ్ముఖ కుమార్, అదనపు కమిషనర్ సీపీరెడ్డి, రాష్ట్ర సంచాలకులు మైలవరపు కృష్ణతేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శంకర్ పాల్గొన్నారు.



శిలఫలాకాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



చెరువు కట్ట వద్ద పనులు జరుగుతున్న దృశ్యం

అవగాహనా లోపంతోనే పక్షవాత మరణాలు

● మెదడును రక్షించడంలో గోల్డెన్ అవర్ కీలకం
● బీఫాస్ట్ పద్ధతిని విస్తృతంగా ప్రచారం చేయాలి
● ఐఎస్‌ఏ సింపోజియంలో వైద్యుల అభిప్రాయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఎస్‌ఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో అవగాహనా లోపం, ఆలస్యమైన వైద్యం కారణంగా పక్షవాతం వలన ప్రాణ నష్టం ఎక్కువగా సంభవిస్తుందని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో ఐఎస్‌ఏ సింపోజియం నిర్వహించారు. దేశంలో పెరుగుతున్న పక్షవాతం కేసుల దృష్ట్యా ప్రజలు తమ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించుకోవాలని, బీ ఫాస్ట్ అనే స్ట్రోక్ హెచ్చరిక సంకేతాల పట్ల అప్రమత్తంగా వుండాలని వైద్యులు సూచించారు. తొలుత ఐఎస్‌ఏ అధ్యక్షురాలు డాక్టర్ వీ విజయ జ్యోతిప్రజ్వలన చేసి సింపోజియంను ప్రారంభించారు. పలువురు వైద్యులు, ఐఎస్‌ఏ ప్రతినిధులు తమ అభిప్రాయాలను, అనుభవాలను వెల్లడించారు. దేశంలో ప్రతియేటా 18లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని చెప్పా రు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి కారణాలతో యువతలో కూడా ఈ తరహా కేసులు పెరుగుతున్నాయన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాతం మొదలైన నాలుగున్నర గంటల (గోల్డెన్ అవర్) లోపు ఆసుపత్రికి చేరుకోవడం ద్వారా మెదడును రక్షించవచ్చని, దీర్ఘకాలిక వైకల్యాన్ని నిరోధించవచ్చని చెప్పారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఈ సింపోజియంలో ఐఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ సుశీల్ శర్మ, ఎయిమ్స్ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ దీప్తి వేపకొమ్మ, పరిపాలనా విభాగం డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం, ఎమర్జెన్సీ వైద్యులు, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయిలో స్ట్రోక్ కేర్ మార్గదర్శకాల అభివృద్ధిపై చర్చించారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవ్

● ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
● తెలుగు కళలకు అద్దం పట్టేలా బాలల ప్రదర్శనలు
● విజేతలకు బహుమతుల అందజేత











పెదకాకాని, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐటీ)లో మూడురోజులపాటు వైభవంగా నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు ఆదివారం ఘనం గా ముగిశాయి. పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనగా.. దాదాపు 25వేల మంది ప్రేక్షకులు బాలల ప్రదర్శనలు చూసేందుకు హాజరయ్యారు. మూడోరోజు విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు జరిగాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద చేసిన జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. విచిత్ర వేషధారణ పోటీలలో చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారి ప్రదర్శనలు సాంప్రదాయాలకు అద్దంపట్టే లా ఉన్నాయి. మట్టిబొమ్మలు, కాగితపు చేతిబొమ్మల అంశాలలో చి న్నారులు ఆసక్తిగా ఆకృతులను రూపొందించారు. బాలోత్సవ్ విజయవంతం కావటంలో వీవీఐటీయా శాక్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రోచాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. బాలోత్సవ్‌లో సంతోషంగా గడిపిన విద్యార్థులు వారి జీవిత లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులకు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, వీవీఐటీయూ వైస్ చాన్సలర్ రాంబాబు కొడాలి, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ కె.గిరిబాబు బహుమతులు అందచేశారు.



మట్టితో బొమ్మలు చేస్తున్న చిన్నారులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం

● బాపట్లలో అఖిల పక్ష సదస్సులో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి



ఐక్యత చాటుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ

బాపట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని ఆం ధ్రప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సదస్సు నిర్వహించారు. పీపీపీ విధానాన్ని విరమించి 590 జీవోను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ డి మాండ్ చేసింది. ప్రముఖ వైద్యుడు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్రకన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగి న ఈ కార్యక్రమానికి మస్తాన్‌వలి ముఖ్యఅతిథి గా మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ మాఫియాను ప్రోత్సహిస్తూ 500 ఎకరాలలో నిర్మాణంలో ఉన్న 10 మెడికల్ కళాశాలలను, 10 ప్రభుత్వ ఆ సుపత్రులను కార్పోరేట్‌కు కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని ఆ రోపించారు. సీపీఎం కేంద్ర క మిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ, విద్య వైద్యరంగాలు సేవారంగాలుగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, దళిత బ హుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి గంటా అంజిబాబు, సీపీఐ కార్యవర్గసభ్యుడు పర్చూరి రాజేంద్రప్రసాద్, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, గంగయ్య, మెడికల్ కళాశాలల కోకన్వీనర్ డాక్టర్ వసుంధర కుర్రా, ఎన్‌జే విద్యాసాగర్, మేదా శ్రీనివాసరావు, దర్శి విష్ణుశంకర్, డాక్టర్ తవ్వా సురేశ్ ప్రసంగించారు. తొలుత ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సభ్యులు బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు.

హోరాహోరీగా ఎడ్లబండ లాగుడు పోటీలు

● సబ్ జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం



ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దుర్గి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 4200 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన రోషన్‌బాబు ఎడ్లజత 4 వేల అడుగులు, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత కూడా 4వేల అడుగుల దూరం లాగి రెండు, మూడుస్థానాలను కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవ ఎడ్లజత 3800 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 3400 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరుకు చెందిన తనుబొత్తి రవిశంకర్‌రెడ్డి ఎడ్లజత 3357 అడుగులతో ఆరోస్థానం, బాపట్ల జిల్లా బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత 3140 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. పోటీలను తిలగించేందుకు రైతులు, పశుపోషకులు భారీగా తరలివచ్చారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించగా పులి హరి, కొత్త వెంకటేశ్వర్లు, పులిబండ్ల పిచ్చయ్య, పెదనేడు గోపీలు పర్యవేక్షించారు. పోటీలను కూటమి నేతలు కటకం రామారావు, ఆకుల రామలక్ష్మయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, గుండాల వెంకటేశ్వర్లు, తోటకూర శ్రీనివాసరావు, వెలిదండి శ్రీనివాసరావులు ప్రారంభించారు. సోమవారం సేద్యం విభాగంలో పోటీలు జరగనున్నాయి.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుండి ఢీకొనడంతో వాహనదారుడు మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం చెరుకుపల్లి మండలం, గూడవల్లికి చెందిన షేక్ అహ్మద్‌వలి(27) రేపల్లె నుండి ద్విచక్రవాహనంపై వస్తుండగా నూరేపల్లి వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో ఇద్దరు గల్లంతు

తుళ్లూరు(రాయపూడి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలం లోని రాయపూడి కృష్ణానది లాంచీ రేవు వద్ద ఇద్దరు వర్కర్లు గల్లంతయ్యారు. పోలీసుల కథనం మేరకు.. శాఖమూరు గ్రామ పంచాయతీ పరిధిలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దగ్గర ఎన్‌సీసీ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు వర్కర్లు నదిలో స్నానానికి దిగారు. ఇందులో ఎన్‌సీసీ స్టోర్‌లో పనిచేస్తున్న అమలాపురానికి చెందిన పవన్ (24), అకౌంటెంటుగా పనిచేస్తున్న గిద్దలూరుకు చెందిన దినేష్(23)లు నదిలో కొట్టుకుపోయారు. మణికంఠ, పవన్‌కళ్యాణ్ అనే ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కలగయ్య ఆధ్వర్యంలో గల్లంతైన వారికోసం పడవలతో గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 43,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెంగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 52350 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 43,500 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3615, పశ్చిమడెల్టాకు 5009, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 9(ఆంధ్రజ్యో తి): నాగార్జునసాగర్ జలాశయం నీటిమ ట్టం ఆదివారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5438, ప్రధానజల విద్యుత్‌కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 51,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0151 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12గంటల వరకు 1.0151 ఎంయూ ల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.5 మీటర్లు, మరో 2 గేట్లను 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 31,101 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నామన్నారు. టీఆర్‌సీ ద్వారా 8461 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఎగువన వున్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,185 క్యూ సెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల..

అచ్చంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,110 క్యూసెక్కుల ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.52వేలు



లాంచీలో కొండకు వెళ్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. కొండపై మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం వీక్షించారు. అనుపులోని యాంపీ థి యేటర్, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయం దర్శించారు. అ నంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా రూ.52వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటంతో వారి అభివృద్ధిపై దృష్టి పెట్టి అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ వన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. పొదుపు మహిళలు, ఉపాధి కూలీల్లో నిరక్షరాస్యులకు, అలాగే చదువు మధ్యలో మానేసి అక్షరాలు పూర్తిగా మరచిపోయిన వారికి విద్యను అందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడనుంది.



శిక్షణ పొందుతున్న మహిళలు

నిరక్షరాస్యుల జీవితాల్లో ఉల్లాస్ వెలుగులు

● వయోజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
● ప్రత్యేక కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం
● పొదుపు సంఘాల్లో మహిళలకు శిక్షణ
● పర్యవేక్షకులుగా వివిధ శాఖల అధికారులు

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యుల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఉల్లాస్ 2.0 కార్యక్రమంతో సిద్ధమయింది. ఈ కార్యక్రమం నిరక్షరాస్యులైన మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా తీర్చిదిద్దనుంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను, ఉపాధి హామీ పనులు చేసే కూలీలను, మధ్యలో బడి మానేసి అక్షరాలు మరచిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించి వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

● 10 మంది సభ్యులకు ఒక వలంటీర్

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఇప్పటికే మండలస్థాయిలో శిక్షణ ఇచ్చి పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీర్ అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్‌వాడి కేంద్రాలు, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రదేశాల్లో తరగతులు సిద్ధం చేస్తున్నారు.

● నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం

రాష్ట్రంలో 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని 28 మండలాల్లో 1,27,057 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి 10 మందికి 1 స్వచ్ఛంద మహిళా వలంటీర్‌ను ఎంపిక చేశారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వలంటీర్లకు ఉల్లాస్ వాచకాలను కూడా పంపిణీ చేశారు.

● 12,757 వలంటీర్లతో బోధన

డీఆర్‌డీఏ పరిధిలో పొదుపులక్ష్మీ గ్రూపులలో 67,935 వేల మందిని, ఉపాధిహామీ పనులు చేసుకునే వారిలో 22,830 వేల మందిని, మునిసిపాలిటీ పరిధి మెప్మాలో 36,800 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరందరికి వలంటీర్లతో బోధన చేయించేలా ప్రణాళికలు చేశారు. ఇందులో 1,04,000 మంది మహిళలు ఉన్నారు. వీరందరికి 2026 మార్చి చివరి వరకు వలంటీర్లు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం వారికి ఎన్ఐఓఎస్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు. ఉల్లాస్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

ప్రకాష్‌నగర్‌లో భారీ చోరీ

నరసరావుపేట లీగల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. మొదటి పట్టణ సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన గడిపూడి సుబ్బారావు, భారతీదేవి దంపతులు గణపవరంలో నివసిస్తున్న వారి కుమార్తె వద్దకు గత మంగళవారం వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన ద్వారం విరగగొట్టి ఉంది. తెరిచి ఇంట్లోకి వెళ్లి చూడగా 560 గ్రాముల బంగారం, రూ.25000 నగదు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ మేరకు వారు మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎం హనుమంతరావు, మొదటి పట్టణ సీఐ ఫిరోజ్ ఘటనా స్థలికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

18 నుంచి తెలుగురాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు

కారంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్లబండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు అన్నారు. ఆరు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బహుమతులు అందిస్తారన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పల్లెపండుగ రెండో విడత రూ.2.50 కోట్లు విడుదల

రెంటచింతల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లో సీసీ రోడ్లు వేసే నిమిత్తం పల్లెపండుగ 2.0 కింద రూ.2.50 కోట్లు విడుదలైనట్లు పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వ్యక్తిగత సహాయకుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెంటచింతల రూ.70 లక్షలు, రెంటాల రూ.10, మిట్టగుడిపాడు రూ.20, పాలువాయి రూ.25, పాలువాయిగేట్ రూ.15, తుమృకోట, కొత్తగంగరాజుపల్లె రూ.40, మల్లవరం రూ.10,జెట్టిపాలెం రూ.10, గోలి రూ.5, పశర్లపాడు రూ.10,మంచికల్లు రూ.25 లక్షలు మంజూరయ్యాయన్నారు.

12న వేలంపాట

మాచర్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతలలో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ విక్రయించుకోవడానికి ఈనెల 12వ తేదీన పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నారు. ఒక్క సంవత్సరంపాటు హక్కులకు వేలం నిర్వహిస్తారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ సత్తెనపల్లి శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సీ వెంకయ్య, కార్యదర్శిగా ఎస్కే మాబూ సుభానీ, ఆర్థిక కార్యదర్శిగా బ్రహ్మేంద్ర నాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ఎస్ఎం సుభానీ, చంద్రజిత్తు తదితరులు పాల్గొన్నారు.

1400 మందికి అన్నదానం

రెంటచింతల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 1400 మందికి అన్నదానం చేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ జీవీ శివయ్యలు చెప్పారు. అన్నదానం చేసిన పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగులు, బి.నరసింహారావు వారి ధర్మపత్ని సీతారావమ్మలను సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందచేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

రెంటచింతల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షులు, వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ వైవీ సైదయ్య ఆదివారం పలువురు పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎ.నరసింహారావు, విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు, బీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాత బకాయిలను చెల్లించాలి

● యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోటిరెడ్డి

మాచర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 104 అంబులెన్స్ సిబ్బందికి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోటిరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తూ ప్రజా సంజీవనిగా పేరు తెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల వలలో చిక్కుకున్నారన్నారు. చాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ లిమిటెడ్ కూడా ఉద్యోగుల సంక్షేమం పట్టించుకోకుండా తీవ్ర ఒత్తిడి పెట్టి పనిచేయిస్తూ నిబంధనలను పాటించడం లేదని ఆరోపించారు. డీఈవోలకు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జీవో ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, 104లో ఫార్మాసిస్ట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ట్రెజరర్ ఎస్కే జిలాని, కార్యదర్శి బాలు, కమిటీ సభ్యులు ఎస్కే సుభాని, బాలకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సత్య సాయి చూపిన మార్గం మానవాళికి ఆచరణీయం

● సేవాసమితి జిల్లా కన్వీనర్



భగవాన్ శ్రీ సత్య సాయిబాబా

నకరికల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా అందరినీ ప్రేమించు.. అందరికీ సేవనందించు అను నినాదం నేటి మానవులు ఆచరించ దగినదని సత్యసాయి సేవాసమితి పల్నాడు జిల్లా కన్వీ నర్ ఉమామాధవ్ అన్నారు. ఆదివారం కుంకలగుంట గ్రామంలో సత్య సాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా అఖండ జ్యోతిని వెలిగించి నగర సంకీర్తన, ప్రత్యేక భజనలు చేశారు. ఆయనతో పాటు శేషిరెడ్డి, సత్య సాయి సేవా సమితి మహిళా భజన బృందం సభ్యులు, హార్మోనిస్టు పాపిశెట్టి వెంకట కృష్ణారావు, కోళ్ళపూడి మాణిక్యారావు, సింగరాజు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆస్పత్రి పరికరాలు



ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా మంచాలు, ఇతర పరికరాలు

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పలు మంచాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇతర పరికరాలు, చిన్న పిల్లలకు ఉపయోగించే పరికరాలు, ఇతర ఆపరేషన్ థియేటర్ పరికరాలు మరమ్మతులకు గురై, పాడైపోయి నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని వేలం ద్వారా విక్రయిస్తే ఆస్పత్రికి ప్రయోజనం చేకూరనున్నది.

మారుమూల రోడ్ల అభివృద్ధే కూటమి ధ్యేయం

● తారు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు

● భూమిపూజ చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల రహదారుల అభివృద్ధే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మండలంలోని వెంకటాయపాలెం నుంచి మన్నె సుల్తాన్‌పాలెం వరకు రూ.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణానికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా వెంకటాయపాలెం గ్రామస్థుల కల నెరవేరిందని ఎమ్మెల్యే అన్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డును అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం వెంకటాయపాలెంలో రూ.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గం చూపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం రామాంజీపురంలో రూ.1.25 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజా నిర్వహించారు. బెల్లంకొండలో రూ.16 లక్షలతో నిర్మించిన బెల్లంకొండ అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే, వెన్నా సాంబశివారెడ్డి ప్రారంభించారు.

కోళ్ళూరు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆకుల జగన్‌ను, టీడీపీ బెల్లంకొండ మండల అధ్యక్షుడిగా అక్కల వెంకటరామిరెడ్డి, నందిరాజుపాలెం సొసైటీ ఛైర్మన్‌గా ఓర్సు ఆనంద్‌ను ప్రమాణ స్వీకా రం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఆలయ కమిటీలు ఆలయానికి, భక్తులకు సేవలు అందించాలని ఆయన సూచించారు. సహకార సంఘంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, సొసైటీ ఛైర్మన్ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మండల అధ్యక్షుడు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆలయానికి వస్తున్న భాష్యం ప్రవీణ్‌కు పూజారులు, ఈవో కోటిరెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, ఓర్సు ఆనంద్, ఆసుల జగన్, తెలుగు యువత అధ్యక్షుడు సలాం, వెంకటాయపాలెం సర్పంచ్ నాగమ్మ బాయి, భూక్యా శ్రీనివాస్‌నాయక్, మేళం శ్రీరామ్మూర్తి, సయ్యద్ జానీ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, హనుమంతరావు నాయక్, డీలర్ సుభానీ, నల్లమేకల నాగేశ్వరరావు, అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి వైపు పయనిద్దాం

● కాకతీయ కమ్మజన సేవా సమితి కార్తీక వన సమారాధనలో వక్తలు



వన సమారాధనలో పాల్గొన్న ప్రముఖులు

మాచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో అభివృద్ధి వైపు పయనిద్దామని, బాలికల విద్యకు అధిక ప్రాధాన్యమిద్దామని, సమష్టి కృషితో సమాజంలో మంచి స్థానం సాధించుకుందామంటూ కాకతీయ కమ్మజన సేవా సమితి కార్తీక వనసమారాధనలో వక్తలు పేర్కొన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం కాకతీయ కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యాన మాచర్ల నియోజకవర్గస్థాయి వన సమారాధన కార్యక్రమాన్ని పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు ప్రసంగిస్తూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ విద్య, వ్యాపార రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకొని అభివృద్ధి వైపు పయనించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మహిళలకు లక్కీడీప్ ద్వారా భారీగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా విశ్రాంత ఐజీ చిరుమామిళ్ల వెంకటనరసయ్య, డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఐ డాక్టర్ పీఎస్సార్ ఆంజనేయులు, సతీమణి మీనాక్షి, ప్రముఖ వ్యాపారవేత్త యాగంటి వెంకటేశ్వర్లు, ప్రముఖ బిల్డర్ వట్టికొండ రంగనాయకులు, గౌరవాధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణయ్య, సేవా సమితి అధ్యక్షుడు బండ్ల బ్రహ్మాయ్య, కార్యదర్శి సాధనాల మల్లికార్జునరావు, కోశాధికారి కాటేపల్లి వేణుగోపాల్, రవి, వెంకట్రామయ్య, కమిటి సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేతి రాతలో 21వేల మంది విద్యార్థులకు శిక్షణ



చేతి రాత నిపుణులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

క్రోసూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చేతి రాతను సరి చేయటంలో 21 వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన నిపుణుడిని ఆదివారం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలలకు వెళ్ళి డాక్టర్ షేక్ జున్ను సాహెబ్, షేక్ బురాన్ అనే చేతి రాత నిపుణుడు విద్యార్థులను తీర్చిదిద్దారని ఈ సందర్భంగా క్రోసూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దుగ్గి బాబూరావు అన్నారు. చేతి రాత నిపుణుడు జున్ను సాహెబ్ మాట్లాడుతూ చేతిరాత సక్రమంగా ఉంటే విద్యార్థులకు ఏ పరీక్షలోనైనా అధిక మార్కులు సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి చేతిరాతపై శిక్షణ ఇవ్వటమే తమ వృత్తిగా భావిస్తున్నామని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు దొప్పలపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రవికాంత్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు మోహన్‌బాబు, ఉపాధ్యాయులు రాంబాబు, బాలెమ్మ్రు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు రెయిన్‌బో స్కూల్ విద్యార్థుల ఎంపిక

కారంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గురజాల డివిజన్ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో కారంపూడిలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అండర్ - 17 బాలుర కబడ్డీలో ఇద్దరు, ఖోఖో పోటీల్లో ఒకరు విజేతలుగా నిలిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్రావు తెలిపారు. ఆదివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చందు, హనుమంతురావు నాయక్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జట్టులో స్థానం పొందిన విద్యార్థులు

రోటరీ క్లబ్ యువజనోత్సవాలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

మాచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో ఆదివారం విద్యార్థులకు నృత్య పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఇక్కుర్తి శంకర్, ఆవుల వీరాంజనేయులు, నిమ్మగడ్డ సురేఖలు వ్యవహరించారు. అలాగే సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రీడా పోటీలను ప్రముఖ దంత వైద్యుడు ఎస్ మురహరిరావు, కల్పనాదేవి, కాళంగి నాగేశ్వరరావులు ప్రారంభించారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్, స్లో సైక్లింగ్ పోటీలు జరిపారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, వెంకట్రామయ్య, అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనంతరామయ్య

దుర్గి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దుర్గికి చెందిన గుదె చిన అనంతరామయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి చిలకలూరిపేట ఆధ్వర్యాన దుర్గిలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధనలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, రాష్ట్ర బ్రాహ్మణ సమైక్య శాశ్వత వ్యవస్థాపక సభ్యుడు ముత్తనపల్లి శివకృష్ణ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు దండమరాజు హనుమంతరావు, యువజన సంఘ సభ్యుడు యండపల్లి సుబ్బారావులు అనంతరామయ్యచే ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువపత్రం అందించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న అనంతరామయ్య

ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం జిల్లా సహాధ్యక్షుడిగా శ్యామ్‌సన్

క్రోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం సహాధ్యక్షులుగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శిఖా శ్యామ్‌సన్ ఎన్ని కయ్యారు. ఈ ఎన్నిక కార్యక్రమం గుంటూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేయనున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు షాద్, గఫ్రూన్, సిరి చందన, ఇతర సిబ్బంది ఆయనను అభినందించారు.



శిఖా శ్యామ్‌సన్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు సన్మానం



ఎమ్మెల్యే కన్నాను సన్మానిస్తున్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నేతలు

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పిడుగురాళ్ళ రోడ్డులో గల వాసవీ గార్డెన్స్‌లో ఆదివారం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. వన సమారాధనలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అసోసియేషన్ నేతలు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యే కన్నాను పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు

● విచారణ గురువు జోసెఫ్ బాలసాగర్



తేరు ప్రదక్షిణలో భక్తులు

విజయపురిసౌత్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా ఉంటాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ అన్నారు. స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన దివ్య బలిపూజ నిర్వహించారు. తేరు ప్రదిక్షణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

● ఏఈ రామ సైద

మాచవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీ లోపు పీఎంఏవై పథకం కింద ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రామ సైదా ఆదివారం తెలిపారు. మొదట నవంబరు 5వ తేదీ వరకు తేదీ ఇచ్చినప్పటికీ సైటు ఓపెన్ కాలేదని, ప్రజల విజ్ఞప్తి మేరకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారని తెలిపారు. అర్హులైన వారు ఆయా గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను కలసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

స్కాలర్స్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన

పిడుగురాళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. పట్టణంలోని స్కాలర్స్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై, ఏ విషయంలో ఎలా మెలగాలో అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎం జగదీష్‌రెడ్డిలు మాట్లాడుతూ కళాశాల స్థాయి నుంచే ఉన్నత చదువులపై దృష్టి సారించగలిగితే మంచి భవిష్యత్తును అందిపుచ్చుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి

మాచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సాయి ఎడ్యుకేషనల్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి అన్నారు. శ్రీసత్యసాయి శత జయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన పట్టణంలోని సొసైటీ కాలనీలో శ్రీసత్యసాయి సామాజిక ఆరోగ్య సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్యంగా లక్ష్మీ ప్రసన్న, సత్యసాయి ఎడ్యుకేషనల్ సెక్రటరీ అక్కినేని అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, సత్యసాయి విద్యా విహార్ ప్రిన్సిపాల్ మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత పోస్టు మాస్టర్ నాగేశ్వరరావు మృతి

కారంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన విశ్రాంత పోస్టు మాస్టర్ బొంకూరి నాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతిచెందారు. ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగానే కాకుండా కళాకారుడిగా పేరొందారు. పౌరాణిక నాటకాల్లో పలు విభిన్న పాత్రలు పోషించి నారద, హరిచంద్ర పాత్రలో మెప్పించారు. స్థానిక సత్యసాయి షిర్డీ సాయి దేవాలయానికి స్థల దాతగా ప్రశంసలు పొందాడు. నాగేశ్వరరావు భౌతికకాయానికి సత్యసాయి సేవా సదన్ సభ్యులు వెచ్చా వరలక్ష్మణరావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, ఎస్‌పీఆర్ కృష్ణలు నివాళులర్పించారు.

పట్టణంలో 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర'

మాచర్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ రామకృష్ణ స్వామి వివేకానంద ధ్యాన మందిరంలో ఆదివారం శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లోని చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్రీనివాసరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యరపతినేనిని గజమాలతో సత్కరిస్తున్న గౌడ సామా జిక వర్గీయులు

కార్తీక వనసమారాధన ఐక్యతకు పునాది

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఆయా సామాజికవర్గాల ఆధ్వర్యంలో జరిగే కార్తీక వనభోజనాల ద్వారా సామాజికవర్గంలో ఐక్యత కనిపిస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణపరిధిలోని భోళాలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, దేవరంపాడు నేతి వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద మేర, రజక, శాలివాహన, గౌడ సామాజిక వర్గాల వనసమారాధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేని హాజరై సామాజికవర్గాల సమావేశాలు, కార్తీక వనభోజనాల ద్వారా ఆయా సామాజికవర్గాల్లో ఐక్యత పెరుగు తుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సామాజికవర్గాల నేతలు, తదితరులు పాల్గొన్నారు. రావిపాడు రోడ్డులోని కమ్మ హాస్టల్‌లో జరిగిన కమ్మ సామాజికవర్గ వనభోజనాల్లో యరపతినేని పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయాధికారులు శ్రీనివాస్ కల్యాణ్, ప్రశాంత్



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస కళ్యాణ్

విజయపురిసౌత్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారులు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్‌లు అన్నారు. ఆదివారం స్థానిక పీటీజీ పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే, అందరికీ న్యాయ సేవలు అందించాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. ప్రతి ఒక్కరిపై చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో న్యాయ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రైయినీ ఎస్ఐ రాంబాబు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, ఆరోగ్యానికి యోగాసనాలు



యోగాసనాల్లో మాచర్లరూరల్ సీఐ నఫీజ్‌బాషా, సిబ్బంది

మాచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో క్రమశిక్షణతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఆదివారం పట్టణ సీఐ వెంకటరమణ ఆధ్వర్యాన పట్టణ పోలీసుస్టేషన్లో యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అనంతకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్లో సీఐ నఫీజ్‌బాషా ఆధ్వర్యాన ఆదివారం పోలీసులు యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్ఐ షేక్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: పోలీస్‌స్టేషన్ ఆవరణలో యోగాసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సీఐ ఎస్ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, శివనాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి : శాలివాహన పెద్దలు



అన్నదాన సత్రానికి రూ.10వేలు అందజేస్తున్న శాలివాహన సంఘ నాయకులు

దాచేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు చదువుకోవాలని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని శాలివాహన సంఘ పెద్దలు స్పష్టం చేశారు. ఆదివారం కార్తీక మాసంతో దాచేపల్లి నగర పంచాయతీలోని తిరుమల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో మండల శాలివాహనులు హాజరయ్యారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ విద్యతోనే ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని సంఘీయులకు వివరించారు. గ్రామానికి చెందిన మద్దికుంట నాగయ్య కోటప్పకొండలోని శాలివాహన అన్నదాన సత్రానికి రూ.10వేలు విరాళం అందజేశారు. మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొగిలిచర్ల ఆంజనేయులు, మొగిలిచర్ల హనుమంతరావు, మద్దికుంట రామకృష్ణ, రంగ, రాజవరపు నరసింహారావు, ఐలాపురం నరసింహారావు, తదితరులు ఉన్నారు.

భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదకూరపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు గ్రామంలో భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. కార్తీకమాస వన సమారాధనను పురస్కరించుకొని ఆదివారం జరిగిన ఈ పూజల్లో ఆలయ పూజారి అనీల్‌కుమార్ మాట్లాడుతూ కార్తీక మాసంలో వన సమారాధన, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే ఆ గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా శివలింగానికి పంచా మృతాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

నేడు చాగల్లులో వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం

నకరికల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చాగల్లు గ్రామంలో సోమవారం రాత్రి 7 గంటలకు నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక ఆర్థిక సాయంతో శ్రీసీతారామాంజనేయ నాటక కళాకారుల సంఘం చాగల్లు వారిచే ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణం, శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం నందు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నలుగురు జూదరుల అరెస్టు

యడ్లపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఓ నివాసంలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,050ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ టి శివరామకృష్ణ మాట్లాడుతూ జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు

బొల్లాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలో సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసిందని ఎంఈవో కే పార్వతి ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసిందని తెలిపారు. అయా తేదీల్లో ఉదయం 8, 9, 10 తరగతులకు, మధ్యాహ్నం 6, 7 తరగతులకు పరీక్షలు నిర్వహించనున్నారు.


ఈపూరులో గుంపులుగా బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థుల పాట్లు

● ఈపూరు ఏపీ మోడల్ స్కూల్‌కు ప్రత్యేక ట్రిప్ నడపాలని తల్లిదండ్రుల వేడుకోలు

ఈపూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు రావాలంటే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చదువుకోవడం ఎలా ఉన్నా స్కూల్‌కి వచ్చి పోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. మరి ఆడపిల్లలైతే వారి ఇబ్బందులు వర్ణనాతీతం. పాఠశాలలో వసతులు అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ చదువు మీద ఉన్న ధ్యాసతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి కూడా పదుల సంఖ్యలో మండల కేంద్రమైన ఈపూరు ఏపీ మోడల్ స్కూల్‌కు విద్యార్థులు వస్తున్నారు. అయితే పాఠశాలకు వచ్చే టప్పుడు వెళ్లేటప్పుడు ఆర్టీసీ బస్సును ఆశ్రయించాల్సి వస్తుంది. బస్సు వద్ద విద్యార్థులు గుంపులు గుంపులుగా చేరి నెట్టుకుంటూ ఎక్కే పరిస్థితి ఉంది. ఆ సమయంలో ఆడపిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు వచ్చే సమయంలో బస్సు కిక్కిరిసిపోతుండటంతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు. మరి కొచ్చర్ల, అంగులూరు గ్రామాల నుంచి వందల సంఖ్యలో పిల్లలు ఈపూరు మోడల్ స్కూల్, హైస్కూల్‌కు ప్రతిరోజు వచ్చి పోతుంటారు. స్కూలుకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు బస్సులో ఎక్కేటప్పుడు నానా అవస్థలు పడాల్సి వస్తుందని విద్యార్థులు అంటున్నారు. కొచ్చర్ల గ్రామం నుంచి సుమారు 100 మంది పిల్లలు ఏపీ మోడల్ స్కూల్‌కు చదువుకునేందుకు వస్తున్నారు. విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం పాఠశాలకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుచున్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

● నరసరావుపేట రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు

నరసరావుపేట రూరల్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా చట్టపరమైన చర్యలు చేపడతామని నరసరావుపేట రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు. నరసరావుపేట రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎంవీ సుబ్బారావు బాధ్యతలు చేపట్టిన వెంటనే రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడేందుకు ఎవరైనా చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు సహకరించాలని ఆయన సూచించారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్ రెడ్డి

కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో ఫైర్‌సేఫ్టీ పై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదాల నివారణపై, ఫైర్‌సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ సిబ్బంది వివిధ రకాల అగ్ని ప్రమాదాలను నివారించే విధివిధానాలను క్రియాత్మకంగా వివరించారు. ప్రమాదాల సమయంలో పేషెంట్లను కాపాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖసిబ్బంది, వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి అన్నాభిషేకం

నరసరావుపేట అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఉన్న కామేశ్వరస్వామి వారికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం విశేష పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం జరిగింది. పూజలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ నిర్వహించారు.

పట్టాభిరామస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి అలంకారం

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు రాంబాబు మాట్లాడుతూ అనవాయితీగా శ్రీవెంకటేశ్వరస్వామి అలంకారం ఆలయంలో జరుగుతుందన్నారు. ఆలయ ధర్మకర్త నాగసరపు సుబ్బరాయగుప్తా సహకారంతో ఐదుగురు అలంకారం ఆకర్షణీయంగా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మూడు రోజులుగా భక్తులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట శ్రీవెంకటేశ్వర యోగ కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దన్‌రావు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బడ్డీకొట్టులో చెప్పులు చోరీ

శావల్యాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బడ్డీకొట్టును గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి దానిలోని చెప్పులను చోరీ చేసిన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యారంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బొందిలిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కాలువ లాజరు శావల్యాపురంలో ఎన్టీఆర్ కూడలి వద్ద జాతీయ రహదారిని ఆనుకొని బడ్డీ కొట్టులో చెప్పుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బడ్డీకొట్టుకు ఒకవైపు తలుపును పగులకొట్టి రూ.3వేలు విలువజేసే 15జతలు చెప్పులను అపహరించారు. ఆదివారం ఉదయాన్నే షాపును తెరిచేందుకు వచ్చిన లాజరు చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

బస్సును ఢీకొన్న ఆటో

వినుకొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోర్‌వీల్ ఆటో అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో పెనుప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని శివాపురం సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సును వినుకొండ నుంచి మార్కాపురం వెళ్లే ఫోర్‌వీల్ ఆటో బలంగా ఢీకొనడంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆర్టీసీ డ్రైవర్ మధు బస్సును పక్కకు తిప్పడంతో ప్రయాణికులకు పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ చేతికి స్వల్పగాయాలతో బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదే సమయంలో ఫోర్ వీల్ ఆటో డ్రైవర్ ఆటోను వదిలి పరారయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజంలో మార్గదర్శకంగా మెలగాలి

● కమ్మ జన కార్తిక వనసమారాధనలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


నరసరావుపేటలో కమ్మ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

వినుకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కమ్మవారు మార్గదర్శకంగా మెలగాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని కమ్మ హాస్టల్ ప్రాంగణంలో కమ్మ జన కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు జీవీ పూలమాలలు అర్పించి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో కమ్మ సోదరులు ఎల్లప్పుడూ సమాజానికి మార్గదర్శకులు, ఆవిష్కర్తలుగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యా సంస్థలు స్థాపించి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన కమ్మ సంఘ సేవకులను ఆయన గుర్తు చేసుకున్నారు. కులం అంటే గొప్పతనం కాదు, సమాజానికి ఉపయోగపడే మన పనులే గొప్పతనం అన్నారు. పేద ప్రతిభావంతమైన విద్యార్థుల కోసం రూ.20నుంచి 50లక్షల నిధులను సమీకరించాలని కోరారు.ఇందుకోసం ఒక ప్రత్యేక సహాయక కమిటీ ఏర్పాటు చేయాలని దీని ద్వారా పారదర్శకంగా విద్యాసాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీధర్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కమ్మ సంఘ ప్రతినిధులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని కమ్మ హాస్టల్లో జరిగిన కమ్మ జన కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు, కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథులు, పట్టణ ప్రముఖులు కమ్మ జన సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సీఎస్‌టీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ మల్లవరపు బాలలత, గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, కడియాల వెంకటేశ్వరరావు, కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్, కోడెల శివరాం, నల్లపాటి రామచంద్ర ప్రసాద్, రావెల సత్యనారాయణ, వేములపల్లి వెంకట నరసయ్య, నాగోతు శౌరయ్య, దండా బ్రహ్మానందం, నలబోతు వెంకట్రావు, డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ, డాక్టర్ నాగోతు ప్రకాషరావు, బండారుపల్లి విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బొప్పూడి శ్రీప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి సతీమణి వెంకటకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి సతీమణి వెంకట కుమారి, ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ, శ్రీశైలం కమ్మ సత్రం అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు, పెంటేల బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమం సమితి నాయకులు పోట్రు పూర్ణచంద్రరావు, దండా గోపిల ఆధ్వర్యంలో జరిగింది.

రెడ్డి కార్తిక వన సమారాధన

వినుకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి బిల్డింగ్ ఆవరణలో రెడ్డి కార్తిక వన సమారాధన, స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాలు, మహిళలతో కోలాటం, భరతనాట్యం, మ్యూజికల్ చైర్స్ లక్కీ డిప్ పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించి విద్యలో ప్రతిచూపిన విద్యార్థులకు రూ.14లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. వన సమారాధనలో సుమారు 6 వేల మందికి విందు ఏర్పాటు చేశారు.

కాపు కార్తిక వన సమారాధన

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు కార్తిక వన సమారాధన కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం నరసరావుపేట మండలం ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం మహంకాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ఎన్ లావణ్య

బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు సీనియర్ సివిల్ న్యాయ అధికారి ఎన్.లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె న్యాయ సేవా దినోత్సవ ప్రాధాన్యం, ఉచిత న్యాయసాయం, నల్సా పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పారా లీగల్ వలంటీర్లు మొదటి పట్టణ ఎస్‌ఐ అరుణ వసతి గృహ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరుని ఆలయంలో అన్నప్రసాదానికి వితరణ


విరాళం అందజేస్తున్న భక్తులు

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన యలవర్తి శశిధర్, తల్లి యలవర్తి పద్మజ అన్నదానానికి రూ.1,01,116 చెక్కు ద్వారా అందజేసినట్లు సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి డి.చంద్రశేఖరరావు తెలిపారు.

నీటమునిగిన తిమ్మాయపాలెం శ్మశానం


శ్మశానం చుట్టూ నిలిచిపోయిన వర్షపునీరు

వినుకొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన మొంథా తుపాను తాకిడికి తిమ్మాయపాలెం శ్మశానంలో నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడతెరపి లేకుండా వర్షాల తాకిడికి భూమిలో నీరు ఇంకే పరిస్థితి లేకపోవడంతో దొండపాడు చెరువు అలుగు నుంచి పెద్దఎత్తున నీరు చేరడంతో శ్మశానం అంతా నీటిమయమైంది. దురదృష్టవశాత్తూ గ్రామంలో ఎవరైనా మృతిచెందినా వారిని ఖననం చేయాలంటే ఈ శ్మశానమే వారికి దిక్కు. గ్రామ సచివాలయం నుంచి శ్మశానం వద్దకు వెళ్లాలన్నా నడుము లోతు నీరు ఉండటంతో గ్రామస్థులు శ్మశానానికి వెళ్లలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని నీటిని తొలగించి అలుగునీటి నుంచి రక్షణ కల్పించి శ్మశానానికి రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కాపురం రోడ్డులో డీసిల్టేషన్ పనులు

వినుకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యుడు జీవీ అంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని మేజర్ డ్రెయిన్ డీసిల్టేషన్ పనులు చేపట్టారు. స్థానిక ప్రజలు, వ్యాపారులు పారిశుధ్య పనులు జరిగే సమయంలో సిబ్బందికి సహకరించవలసిందిగా కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

జగనన్న కాలనీలో వసతులు కల్పించండి

వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో వీధిలైట్లు తాగునీటి వసతి కల్పించాలని పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి కోరారు. ఆదివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు రోడ్డులోని జగనన్న కాలనీలో పర్యటించి అక్కడి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పలపాడు రోడ్డులో ఏర్పాటైన జగనన్న కాలనీలో సుమారు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నారన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ 18నెలల కాలంలో కాలనీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారిందని, ఎక్కడ చూసినా గుంతలమయంగా ఉందని, బైకులు, స్కూటీలు లాంటి చిన్న వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదన్నారు. రాత్రి పూట వాహనాల మీద వెళ్లే పరిస్థితి లేదని కరెంట్ పోల్స్‌కు కనీసం లైట్లు లేవు అని, చుట్టూ పొలాలు ఉండటంవల్ల పాములు విపరీతంగా వస్తున్నాయని, కనీసం కాలనీలో తాగునీటి సౌకర్యం లేదన్నారు. మున్సిపల్ ట్యాంకర్లతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారి వరకు వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అవిశాయపాలెం టు కోటప్పకొండ రోడ్డు కోసం రూ.4.50 కోట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంజూరు చేసి సంవత్సర కాలమైంద ఇంతవరకు ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభించలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం డిపాజిట్లు తీసి కోటప్పకొండ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే దుస్థితిలో ఉందన్నారు. కోటప్పకొండపై అధిక ధరలు ఉన్నాయని పత్రికలలో కథనాలు వచ్చినా ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.

నిఘా నేత్రాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

● వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య

శావల్యాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న దొంగతనాలు, నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘానేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. శావల్యాపురం సెంటర్‌లోని కనకదుర్గమ్మ దేవాలయంలో సీసీ కెమేరాలను ఆయన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బొందిలిపాలెంకి వెళ్ళే మలుపులో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావుకు సూచించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు రాత్రివేళల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

500 మందికి బెడ్ షీట్లు పంపిణీ

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో లీడ్స్ ఎన్‌జీవో సంస్థ 500మంది పేద మహిళలకు పౌష్టికాహారం, బెడ్ షీట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలలు చేశారు. విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీ పార్కు వద్ద పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పాకెట్లు, ఆహార పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డాక్టర్ పీ బార్గవభూషణరావు, డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా గురువుల సాంస్కృతిక పోటీలు


కోలాటం ఆడుతున్న మహిళా ఉపాధ్యాయినులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులు తమలోని ప్రతిభను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన పోటీలు సాయంత్రం వరకు జరిగాయి. కోలాటం అందరిని ఆకర్షించింది. పోటీల సందర్భంగా కళాశాల ఆవరణ అంతా పండుగ వాతావరణం కన్పించింది. నిత్యం పిల్లలతో బోధనలో గడిపే ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులకు ఈపోటీలు ఒక ఆటవిడుపులా తమలో దాగి ఉన్న సృజనాత్మకతను బైటకు తీశాయి. పోటీలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని తిలకించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో విజేతలకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమం ఆసాంతం బాలోత్సవం కార్యనిర్వాహక సభ్యులు, వలంటీర్లు నిర్వహించారు.

ఘనంగా నాసరయ్య తిరునాళ్ళ

బొల్లాపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమలచెరువు గ్రామంలో నాసరయ్య తిరునాళ్ళ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. వీటిని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బొల్లాపల్లి ఎస్‌ఐ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకర్షిస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం పేర్కొన్నారు. 410 ఒప్పందాలు, రూ.9.8 లక్షల పెట్టుబడులతో విశాఖ భాగస్వామ్య సదస్సు సాక్షిగా నవ్యాంధ్రప్రదేశ్ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించనుందని తెలిపారు. పాలకులు సమర్థులైతే ప్రజల ముంగిటకే అభివృద్ధి ఫలాలు చేరతాయనడానికి జరుగుతున్న పరిణామాలే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. జగన్ హయాంలో గంజాయి తదితర మాదకద్రవ్యాలకు రాష్ట్రాన్ని కేరాఫ్‌గా మార్చి అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరువు ప్రతిష్టలను బజారుకీడ్చారని విమర్శించారు. మేధాసంపత్తికి మారుపేరైన రాష్ట్ర యువత బంగారు భవిష్యత్‌ను జగన్ నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.

150మంది రోగులకు వైద్యపరీక్షలు

వేల్పూరు (శావల్యాపురం) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణానికి చెందిన శ్రీరాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం వేల్పూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి 150మంది రోగులు వైద్యశిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. హాస్పిటల్ నుంచి ప్రముఖ వైద్యులు అనిరుద్ ఫణిబార్గవ్, సత్యకృష్ణ దీపిక పాల్గొని రోగులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆర్థోపెడిక్, గైనకాజిస్ట్ విభాగాల పరీక్షలు నిర్వహించి రోగులకు సలహాలు, సూచనలను అందించారు. వైద్య శిబిరానికి ఆర్ఎంపీ మూర్తి, బీజేపీ మండలాధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావులు తమవంతు సహాయ, సహకారాలను అందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

చిలకలూరిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన శైలితో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగి మరణాలకు దారి తీస్తున్నాయని, ముందు జాగ్రత్తగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకుని రక్షణ పొందాలని క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ శుభశ్రీ ఆదివారం చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, గుంటూరు ఒమేగా హాస్పిటల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవన్‌లో 70మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.7,500 ఖర్చు అయ్యే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా డాక్టర్ శుభశ్రీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, ఒమేగా హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ లాల్ మహమ్మద్, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాదు, బోడి రామసుబ్బారావు, నార్నె జయలక్ష్మి, సి.చైతన్య, పి.రమాదేవి పాల్గొన్నారు.